# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 05 ఆగస్టు, 2026 | పేజీలు : 08


## పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టాలి



2 లో...

జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

# పార్టీలకతీతంగా గ్రామాలభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర :** పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏడిఏ, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రియదర్శిని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం తీవ్ర వాడీ వేడీగా సాగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రవాణా, పశువైద్యం, ఆరోగ్య శాఖల అలసత్వంపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఇదే సమయంలో సర్పంచుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొద్దిసేపు సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలలో ఏలాంటి రాజకీయ వివక్షకు తావు ఇవ్వడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏ పార్టీకీ చెందిన సర్పంచ్ అయినా సమానంగా సహకారం అందజేస్తామని అన్నారు. ప్రథమ పౌరులైన సర్పంచులు గ్రామ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి పూర్తి బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి గ్రామానికి సంబంధించిన సమస్యలు ప్రాధాన్యత క్రమంలో లిఖితపూర్వకంగా అందించాలని వాటి పరిష్కారం దశలవారిగా పరిష్కరిస్తానన్నారు. అధికారులు ప్రజల నుంచి వచ్చే వినతులపై వెంటనే స్పందించాలని ఫోన్లు చేసినా వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు.. సర్పంచ్ మధ్య గొడవ

సమావేశంలో కొండయ్యపల్లి గ్రామానికి సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కొండయ్యపల్లి సర్పంచ్ మాట్లాడేందుకు ప్రయత్నించా రు. అయితే సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జోక్యం చేసుకొని మాట్లాడవద్దని వారించడంతో ఇరువురి మధ్య చిన్నపాటి గొడవ మొదలైంది.సర్పంచుల పోరం అధ్యక్షుడు అలా మాట్లాడడం పద్ధతి కాదు అని అనడం తో ప్రజా స మస్యలు మాట్లాడకుండా అడ్డుకోవడం సబ బు కాద ంటూ సభలోని మరికొందరు సర్పంచులు ఆగ్ర హం వ్య క్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం ముదిరి కొంతసేపు సభలో గందరగోళం ఏర్పడగా ఎమ్మెల్యే అధికారులు జోక్యం చేసుకొని సర్దుబాటు చేశారు.

### వివిధ సమస్యలపై సర్పంచుల నిలదీత

మిషన్ భగీరథ నీరు గర్షకుర్తిలో వారానికి రెండు రోజులు





ఇవ్వడం లేదని మధురానగర్‌లో మిషన్ భగీరథ నీరు దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తాగలేకపోతున్నారని సర్పంచులు తెలపగా బూరుగుపల్లి, ఒద్యారం, వెంకంపల్లి , రంగారావుపల్లి, మంగపేట గ్రామాల్లో క్లోరినేషన్ ట్యాంకర్లు అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా 55 అంగన్‌వాడీ పాఠశాలలకు గాను 22 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఐసిడిఎస్ అధికారి తెలిపారు. లింగంపల్లిలో అంగన్‌వాడీ తదితర అంగన్వాడీ సమస్యలు ప్రస్థావించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు స్టాఫ్ నర్సులు ఉండాల్సిన చోట ఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే ఉందని తదితర సమస్యలు తెలిపారు. ఎంపిడివో దమ్మని రాము, తహసీల్దార్ అంబటి రజిత, ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్, 33 గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగుకు 'సిరుల బాట' నిర్మల్ జిల్లాకు భారీగా సబ్సిడీలు

### ఆయిల్ పామ్, సూక్ష్మ సాగుకు ప్రాధాన్యం!

**ప్రజాపక్షం/నిర్మల్ :** వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది.సంప్రదాయ వరి సాగు నుంచి అధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల వైపు రైతు సోదరులను మళ్లించడమే ప్రధాన ధ్యేయంగా జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్మల్ జిల్లా పరిధిలో వివిధ అభివృద్ధి పథకాల కింద రైతులకు భారీగా సబ్సిడీలను అందించేందుకు ప్రణాళికలను ఖరారు చేశారు. పండ్ల తోటల పెంపకం,ఆయిల్ పామ్, సూక్ష్మ నీటిపారుదల, తీగజాతి కూరగాయల సాగుతో పాటు పట్టు పరిశ్రమ విస్తరణకు బహుళ ప్రోత్సాహ



కాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. విస్తృతంగా ఆయిల్ పామ్ తోటల సాగు..దేశంలో వంటనూనెల దిగుమతి భారాన్ని తగ్గించడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన, శాశ్వత ఆదాయాన్ని అందించే లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును జిల్లాలో ప్రాధాన్యత రంగాలుగా చేపట్టారు. గత నాలుగు సంవత్సరాలుగా (2022–23 నుండి 2025–26 వరకు) జిల్లా వ్యాప్తంగా

తరువాయి 2 లో...

# కలెక్టరేట్ ఆర్చ్ ... ఆకర్షణీయంగా నిర్మించాలి

### అభివృద్ధి పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలి కలెక్టర్



తరువాయి 2 లో...

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** నూతన కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్చి ఆకర్షణీయంగా నాణ్యతతో జిల్లాకు గుర్తింపుగా ఉండేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్చి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్చి నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధాన గేటు నిర్మాణంతో పాటు రహదారి, ల్యాండ్ స్కేపింగ్, పచ్చదనం, ఇతర మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా

## కంప్యూటర్ గ్రాఫిక్ డిజైన్ శిక్షణ ప్రారంభం

ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని తిలక్‌నగర్‌లోని సింగరేణి స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో కంప్యూటర్ గ్రాఫిక్ డిజైన్, వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సు లను ఆర్‌జి1 జీఎం డి.లలిత్‌కుమార్ మంగళ వారం ప్రారంభించారు. దీంతోపాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవ గాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎస్టోటూ జీఎం చంద్రశేఖర్, పర్స నల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, జివిటిసి మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీ సర్ శ్రావణ్‌కుమార్, ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ దశరథ్, ఆర్గనైజర్ ఖాన్, శిక్షణ కేంద్రం అధ్యాపకులు, పాల్గొన్నారు.

## ముప్పై ఏళ్ల సేవ.. ఇప్పుడు తొలగింపా..?

ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని లోని లెనిన్‌నగర్, సెక్టార్1, సింగరేణి స్కూల్, విఠల్‌నగర్, 7 ఎల్‌పి బొగ్గు గని వద్ద గత 30 ఏళ్లుగా సింగరేణి కార్మికులకు, ప్రజలకు సేవలు అందిస్తున్న సులభ్ కాంప్లెక్స్‌ల తొల గింపు ప్రయత్నాలు మానుకోవాలని జీఎంను కోరుతూ ఆర్‌జి1 ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు ఐఎఫ్‌టియు అనుబంధ సింగరేణి సులభ్ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. కార్మిక వ్యతిరేక నిర్ణయాలు మానుకోని సులభ్ కాంప్లెక్స్‌లను యథావి ధిగా కొనసాగించాలని కోరినట్లు ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్, ఎస్‌సిసిడ బ్ల్యుయు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐ.రాజేశం, జీవన్, డివిజన్ అధ్యక్షులు కోట వెంకన్న, నాయకులు రామారావు, తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం లోని గొల్లపల్లి గ్రామంలోని ఓ ఇంటిలో పేకా ట(జూదం) నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకు న్నారు. అక్కడ ఏడుగురు వ్యక్తులు ప్లేయింగ్ కార్డులతో జూదం ఆడుతూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ప్లేయింగ్ కార్డులతో పాటు 4,050 రూపా యల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీ సులు తెలిపారు.గ్రామాల్లో చట్ట విరుద్ధ కార్యక లాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రా నికి చెందిన సాన లలిత ఇల్లు శిథిలావస్థలో ఉండగా గత వారం రోజుల నుండి కురు స్తున్న వార్షానికి మట్టి పెల్లలు ఊడి కింద పడుతున్నాయి. ఇట్టి సమాచారం తెలుసు కున్న మండల తహసీల్దార్ సుజాత, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి , ఆర్‌బి సాహితి, కార్య దర్శి కృష్ణహరి, వార్డు మెంబర్ జవాజి వరల క్ష్మి కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇల్లు 80శాతం పూర్తిగా శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ తన తల్లి వృద్ధాప్యంలో ఉందని, ఇందిరమ్మ ఇల్లును తనకు మంజూరు చేయాలని కోరారు.

# ఉద్యోగ భద్రతకు సింగరేణి నర్సరీ కార్మికుల విజ్ఞప్తి

ప్రజాపక్షం/గోదావరిఖని : సింగరేణి ఆర్‌జి1 పరిధిలోని నర్సరీల్లో తమ రోజువారీ పనులను నిలుపుదల చేయ కుండా, తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి, సీఎంపిఎఫ్, బోనస్, ఉచిత వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించా లని మహిళా కాంట్రాక్టు కార్మికులు సింగరేణి యాజమా న్యాన్ని కోరారు. మంగళవారం ఆర్‌జి1 కార్యాలయం ఎదుట సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయ కులు శనగల శ్రీనివాస్, తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. గత 39 సంవత్స రాలుగా 26 మంది కార్మికులు నర్సరీల్లో పనిచేస్తూ అతి తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకుంటు న్నారని, గత 3 నెలలుగా కార్మికులకు పనుల కేటాయిం పులో అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సరైందికా



దని నాయకులు అన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా కార్మికులు అందరికి ప్రతిరోజూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నరహరి పద్మ, చెర్ల రాజేశ్వరి, మాదాసి వనమాల, మాదాసి లక్ష్మి, పోగుల లక్ష్మి, అనపురం శారద, ఈశ్వరి, మినుము సుజాత, గాదం లక్ష్మి, కన్నూరు రాజేశ్వరి, ఆడెపు లక్ష్మి, రాజమణి, ఓదమ్మ, భాగ్యలు పాల్గొన్నారు.

# తల్లి పాలలోనే పూర్తి పోషకాలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : తల్లి పాలలోనే బిడ్డకు కావలసిన అన్ని పోషకాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్స వాలను ఆగస్టు 01 నుంచి 07 వ తేదీ వరకు కొనసాగు తుండగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్న మెంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో మంగళవారం బాలింతలకు నిర్వహించిన కార్య క్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారం భించారు. డెలివరీ అయిన మొదటి గంటలోనే బిడ్డకు పాలు ఇవ్వాలని సూచించారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లి పాలే ఇవ్వాలని స్పష్టం చేశారు. పాలు పిల్లల ఎదుగుదల, బరువు పెరిగేందుకు ఉపయోగ దుతా యని తెలిపారు. దీంతో బాలింతలు కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. వైద్యుల సూచన మేరకు బాలింతలు ఆహారం తీసుకోవా లని తెలిపారు. బాలింతలు పోషకాహారం, డ్రై ఫ్రూట్, తినాలని సూచించారు. పుట్టిన బిడ్డకు పాలు ఎలా ఇవ్వాలో శిక్షణ ఇవ్వాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశిం చారు. తల్లిపాల వారోత్సవాలు జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించా లని సూచించారు. ఆశ వర్కర్లు తమ పరిధిలోని బాలింత లను కలిసి.. ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, పాలు ఇవ్వడం మందులు క్రమం తప్పకుండా తీసుకోవడంపై అవగాహన కల్పిస్తూ.. అందుబాటులో ఉండాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా



ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మహేష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, వార్డు కౌన్సిలర్ నీరజ, మున్సిపల్ కమిష నర్ ఖదీర్ పాషా, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

**వేములవాడ:** వేములవాడ మండలం మారుపాక గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దొబ్బల మల్లేశం ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహార అవసరం అని శిశు సంరక్షణ చర్యలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొబ్బల మల్లేశం మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు అని స్పష్టం చేశారు. ప్రసవం జరిగిన వెంటనే, పుట్టిన గంట లోనే శిశువుకు ముర్రిపాలు పట్టించడం ఎంతో అవసర మని, అవి బిడ్డకు తొలి రోగనిరోధక శక్తిని అందించే అమృతం లాంటివని పేర్కొన్నారు.

## గంజాయి,డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : గంజాయి,డ్రగ్స్ ఎవరైన అమ్మితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిం చారు.జిల్లా ఎస్పీ మహేష్‌బీగీతే ఆదేశానుసారం ఎల్లారెడ్డిపే టలో డాగ్‌స్క్వాడ్ బృందంతో పలు షాపుల వద్ద మంగళ వారం తనిఖీలు నిర్వహించారు.నార్కోటిక్ జాగిలంతో రవాణ విక్రయాలపై నిఘా తీవ్రతరం చేస్తున్నారు.యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దని పోలీసులు హెచ్చరిం చారు.తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని అన్నారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.తెలంగాణ ఈగల్ టీం నంబర్ 8712671111కు సమాచారం అందివ్వాలని పోలీ సులు కోరారు.మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం నిరం తర తనిఖీలు చేపడతామని తెలిపారు.

## తల్లిపాల వారోత్సవాలు

ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల రూరల్ మండలంలోని సోమనపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగ ళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లా డుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే పాలు పట్టించాలని పేర్కొన్నారు.నవజాత శిశువు కి తల్లిపాల ఎంత ముఖ్యమో వాటి విశిష్టత గురించి వివరించారు.అనంతరం కేంద్రంలో ఉన్న పిల్లలకు యూనిఫాం అందజేయడం జరిగింది.కార్యక్ర మంలో సర్పంచ్ చెవుల గంగన్న, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మి,అంగన్వాడీ టీచర్లు నిర్మల,లలిత,హెల్పర్ జమున, తల్లులు,గర్భిణీలు,బాలింతలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలి

### ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : విద్యార్థులు సమ యాన్ని వృథా చేయకుండా ఇప్పటి నుంచే లక్ష్యంతో చదువుతూ క్రమశిక్షణతో కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. మంగళ వారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యా లయం, పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు.అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి, సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యా ర్థులు రూపొందించిన రోబోటిక్ ప్రాజెక్టులు, త్రీడీ ప్రింటర్ ద్వారా తయారు చేసిన నమూనాలను తిల కించి వారి ప్రతిభను కొనియాడారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు,మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం గోపి, ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్, ఆరవ వార్డు మెంబర్ జవ్వాజి రాకేష్, నాయకులు నేమూరి సత్యనారాయణ, నరేష్, ఇతర ప్రజాప్రతిని ధులు, యువకులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఆర్చీ ఆకర్షణీయంగా నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నిర్మాణ పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ఆకట్టుకునే విధంగా ఆర్చి నిర్మాణం ఉండాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను సమన్వయంతో నిర్వహిస్తూ కలెక్టరేట్ పరిసరా లను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవె న్యూ అధికారి స్వామి, ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, సంబం ధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టాలి

ప్రజాపక్షం/కరీంనగర్: బిడ్డ పుట్టిన గంటలోపలే శిశువుకు తల్లి పాలు పట్టించాలని, అప్పుడే బిడ్డ జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి అన్నారు. కరీంనగర్ లోని జ్యోతినగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అంగన్వాడీలో ఇచ్చే బాలామృతం బిడ్డ ఎదుగుదలకు చక్కని ఆహారమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు బలవర్ధక ఆహారం తీసుకోవాలని, బిడ్డకు అది ఆరోగ్యకరమని అన్నారు. తల్లిపాలు ఇవ్వడంలో కుటుంబ సభ్యుల సహకారం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ మహేష్, అంగన్వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగుకు 'సిరుల బాట' నిర్మల్ జిల్లాకు భారీగా సబ్సిడీలు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 3,524 మంది రైతులు 8,751.72 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి మంచి ఫలితాలను సాధించారు. ఈ వరుస ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్తూ, ఈ ఆర్థిక సంవత్సరంలో నూతనంగా మరో 1,600 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరిం చాలని నిర్దేశించుకున్నారు. ఇందులో సాధారణ కేటగిరీ రైతులకు 1,208 ఎకరాలు,ఎస్సీ రైతులకు 247 ఎకరాలు, ఎస్టీ రైతులకు 145 ఎకరాల విస్తీర్ణాన్ని ప్రత్యేకంగా కేటాయిస్తూ రాయితీలు కల్పి స్తున్నారు. సూక్ష్మ సేద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత..లభ్యతలో ఉన్న సాగునీటిని ఆదా చేస్తూ, పంటలకు ఎరువుల సమర్థ వినియోగానికి తోడ్పడే తెలంగాణ సూక్ష్మ సేద్య ప్రాజెక్టు కింద డ్రిప్, స్ప్రింక్లర్ పరిక రాల మంజూరుకు పెద్దపీట వేశారు. కుటుంబానికి గరిష్టంగా 12.5 ఎకరాల వరకు ఈ సబ్సిడీని పొందే అవకాశం ఉంటుంది. పండ్ల తోటలు, పందిరి సాగుకు ఊతం..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు జరుగుతున్న ఉద్యానవన సమగ్ర అభివృద్ధి మిషన్ ద్వారా రూ.120.27 లక్షలతో 567.16 హెక్టార్లలో వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయలు, ఉల్లిపాయలు, దుంప మరియు సుగంధ ద్రవ్య పంటల విస్తరణకు శ్రీకారం చుట్టారు.అంతే కాకుండా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద తీగజాతి కూరగా యల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం సబ్సి డీతో రూ.50,000 వరకు సాయం అందిస్తున్నారు. పొలం గట్ల వెంట వెదురు సాగుకు జాతీయ వెదురు మిషన్ కింద ఎకరానికి రూ.24,000 ప్రోత్సాహకం ఇస్తుండగా, మల్బరీ తోటలు, పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి పట్టు పరిశ్రమ శాఖ ద్వారా రూ.2.85 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తున్నారు.రైతాంగం సద్విని యోగం చేసుకోవాలి:జిల్లాలో వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు లభిస్తున్న ఈ సబ్సిడీ పథకాలను నిర్మల్ జిల్లాలోని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. తమ భూముల స్వభావం, నీటి వసతికి అనుకూల మైన పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకం,ఆధార్ కార్డు వివరాలతో స్థానిక మండల ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచిస్తు న్నారు.

## తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని వైద్య కళాశాలలో భవన నిర్మాణాల ప్రారంభం నుంచి సెక్యూరిటీగార్డు, స్కావెంజర్, స్వీప ర్లుగా పేద కార్మికులు పనిచేస్తున్నారు. అయితే ఏలాంటి కారణం చూపకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా తమను విధుల నుంచి తొలగించారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను వినతి పత్రం ద్వారా కోరినట్లు కార్మికులు తెలిపారు. చాలీచాలని వేతనా లతో పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇపుడూ ఆ పని కూడ తమకు లేకుండా చేస్తే తాము రోడ్డున పడాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

### దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** 2026–27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ప్రక్రియలో చివరి విడత అయిన స్పెషల్ డ్రైవ్ ఫేజ్ షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి విడుదల చేసినట్లు ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) కరీంనగర్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు అడ్మిషన్ కమిటీ కో ఆర్డినేటర్ డా.కె.సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డా.ఆర్.రామకృష్ణతో కలిసి విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బి.ఎస్సీ ఫిజికల్ సైన్స్, బిఎస్సీ లైఫ్ సైన్స్, బిఎస్సీ హెల్త్ కేర్(ఏఈడీపీ), బిఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బి.కాం బిజినెస్ అనలిటిక్స్, బి.కాం ఫైనాన్స్, బిబిఏ, బి.ఏ(ఇంగ్లీష్ మీడియం), బి.ఏ(తెలుగు మీడియం) తదితర కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతిష్టాత్మకమైన ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా రూపొందించిన బి.ఎస్సీ హెల్త్ కేర్ ఏఈడీపీ కోర్సులో కూడా పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 6 నుంచి 11 వరకు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆగస్టు 6 నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 14న సీట్ల కేటాయింపు జరగనుండగా సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 14 నుంచి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఆగస్టు 17, 18 తేదీల్లో ఇంటర్మీడియట్ ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టిసి)తో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు వాటి జిరాక్స్ ప్రతులతో కళాశాలకు హాజరై కాలేజ్ కన్ఫర్మేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్ ఫేజ్ చివరి అవకాశం కావడంతో ఇప్పటివరకు ప్రవేశాలు పొందని విద్యార్థులు వీలైనన్ని ఎక్కువ వెబ్ ఆప్షన్లు నమోదు చేసి తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ పి.నితిన్, టి.రాజయ్య, అడ్మిషన్ కమిటీ కో ఆర్డినేటర్ కళాశాల విద్య జేఏసీ చైర్మన్ డా.కె.సురేందర్ రెడ్డి, దోస్త్ కో ఆర్డినేటర్ డా.ఆర్.రామకృష్ణ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ హర్జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.ఎం.శ్రీనివాస్ రెడ్డి, డా.బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ డా.ఎం.సత్యప్రకాశ్, వివిధ విభాగాధిపతులు, దోస్త్ కోర్స్ కన్వీనర్లు పాల్గొన్నారు.

## తల్లి పాల వారోత్సవాలు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లె గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ అరుకొంతం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.సర్పంచ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లి పాలు పిల్లలకు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని, శిశు మరణాలను తగ్గిస్తాయని, ప్రతి తల్లి తప్పకుండా తల్లి పాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడి జైపాల్ రెడ్డి, కార్యదర్శి ఉపేందర్, ఐకేపీ సీసీ వసంత, అంగన్‌వాడీ టీచర్ పులి శారద, విఓఏ స్రవంతి, తల్లులు రేణుక, శ్రీవాణి, జమున, సుప్రియ,భాగ్యలక్ష్మీ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ కలశ శోభాయాత్ర

**ప్రజాపక్షం / జమ్మికుంట :** భక్తిమయం కలశ అర్చనలు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి యొక్క 70వ తిరు నక్షత్ర ప్రయుక్త జన్మదినం సందర్భంగా జమ్మికుంటలో శ్రీరామ హృదయం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు కలశాన్ని భక్తులు శోభాయాత్రగా తీసుకొచ్చారు.రామనామ స్మరణతో భక్తులు తన్మయం చెందారు. తమలపాకుల అర్చన నిర్వహించారు. వికాస తరంగిణి ప్రతినిధులు రాజిరెడ్డి, ప్రభాకర్ రావు, సమ్మయ్య, ఎదులాపురం వెంకటేశ్వర్లు, వీరన్న, పుల్లూరి శ్రీనివాస్, పి.సమ్మారావు, సుంకరి యాదయ్య పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే సత్యం

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్ తండ్రి ముత్తయ్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ముత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, నాయకులు బైరి సంపత్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆల్ఫోర్స్ విద్యార్థులు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** అథ్లెటిక్స్ క్రీడలకు మూలాధారమని, ప్రతి క్రీడాకారునిలో వేగం, బలం, ఓర్పు చురుకుదనాన్ని పెంపొందిస్తాయని విద్యార్థుల్లో శారీరక ధృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ పెంపొందించడంలో అథ్లెటిక్స్ కీలకపాత్ర పోషిస్తుందని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. అథ్లెటిక్స్ పోటీలు ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వ స్ఫూర్తిని పెంచుతాయని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని అలవర్చే గొప్ప వేదిక అథ్లెటిక్స్ అని అన్నారు. ఇటీవల కాలంలో కరీంనగర్ లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన 1వ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కొనియాడారు. వీరందరూ ఈనెల 7న హన్మకొండలో జేఎన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

# మానేరులో ఘనంగా బోనాల సంబురాలు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ పద్మనగర్ లోని మానేరు సీబీఎస్‌ఈ విద్యా సంస్థల్లో తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక సాంసకృతిక వైభవానికి ప్రతీక అయిన బోనాల పండుగను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించేలా ప్రత్యేకంగా అలంకరించగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ భక్తిభావాన్ని చాటగా పోతరాజు విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ జానపద నృత్యాలు ప్రదర్శించి అందిరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజు చాకో మాట్లాడుతూ తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భావి తరాలకు పరిచయం చేయడం ప్రతి విద్యా సంస్థ బాధ్యత అని అన్నారు. విద్యార్థులు పుస్తక విద్యతో పాటు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఆధ్యాత్మిక విలువలను కూడా తెలుసుకోవాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని ముత్యాల పోచమ్మ దేవాలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. విద్యాసంస్థల వైస్ ప్రిన్సిపాల్స్, ఇంఛార్జీలు, అకడమిక్ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పరస్పరం దూషించుకున్న ఇరువర్గాలపై కేసు

### ఇద్దరిపై ఎస్సి, ఎస్టి కేసు నమోదు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** కులం పేరుతో దూషించడమే కాకుండా తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తులపై గన్నేరువరం పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కుర్ర మనిషా భర్త హరీశ్ ను అలాగే వారి కుటుంబ సభ్యులతో అదే గ్రామానికి చెందిన బోయిని కుమార్, ద్రమార్ అనిల్ ఇద్దరు వార్డు సభ్యులు వీరిద్దరూ హరీశ్ కట్టుకున్న ఇంటి స్థలంలో నుంచి వివో బిల్డింగ్ కోరకు కొంత స్థలం ఇవ్వాలని తమ కుటుంబాన్ని తరచూ టార్గెట్ చేస్తూ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని ఇటీవల కుర్ర హరీశ్ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ ముందు పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపారు. దీంతో బోయిని కుమార్, ద్రమార్ అనిల్ వేధింపులు మరింతగా పెరిగాయని తమను బోయిని కుమార్, ద్రమార్ అనిల్ అనే వ్యక్తులు గొడవకు దిగి కులం పేరుతో దూషించారని కుర్ర మనిషా హరీశ్ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయిని కుమార్, ద్రమార్ అనిల్ లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు అదే సమయంలో బోయిని కుమార్, ద్రమార్ అనిల్ లను దూషించినందుకు కుర్ర హరీశ్, కుర్ర అజయ్, కుర్ర వర్షినిలపై బోయిని కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.నరేందర్ రెడ్డి తెలిపారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన సారయ్య గౌడ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వృత్తి రిత్యా తాటి చెట్టు పై నుండి ప్రమాదవ శాత్తు క్రింద పడి కాలు విరిగి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో చికత్స పొందుతున్న పెద్దపల్లి మండలం భోజన్నపేట కు చెందిన బాలసాని సమ్మయ్య గౌడ్,ఇటీవల తాడి చెట్టు పై నుండి క్రింద పడి తీవ్ర గాయలతో కోలుకోలేని పరిస్థితి లో వున్న జూలపల్లి మండలం కాచ పూర్ కు చెందిన పాలకుర్తి రాములు గౌడ్ లను కల్వశ్రీరాం పూర్ మాజీ ఎంపిపి గోపాగోని సారయ్య గౌడ్ పరామర్శించారు.ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణారావు సహకారం తో బాధితులకు ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా గౌడ సంఘాల నాయకులు పడాల కొమురయ్య గౌడ్,బాలసాని వెంకటేశం గౌడ్,కాచపూర్ గౌడ సంఘం అధ్యక్షులు రాజేశం గౌడ్,అంజయ్య గౌడ్,మహేష్ గౌడ్,తదితరులు వున్నారు.

## మన బడి... మన బాధ్యత...!

**ప్రజాపక్షం/అంతర్గాం :** మన బడి.. మన బాధ్యత.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయి కలపండి, పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయండంటూ ఆ గ్రామ మహిళా సర్పంచి పిలుపునిచ్చారు. తన ఇద్దరు కుమారులను గ్రామ సర్కారు బడిలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామ సర్పంచి జూపాక మమత శ్రీనివాస్. మంగళవారం గ్రామ ప్రజల సమక్షంలో తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు పిల్లలను చేర్పించినట్లు ఆమె తెలిపారు.

## ప్రభుత్వ బడులకు..

# మెయింటెనెన్స్ బడ్జెట్ పెంచాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ బడులకు మెయింటెనెన్స్ బడ్జెట్ పెంచాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సిపిఎం టౌన్ కార్యదర్శి దండి సతీశ్ ఆధ్వర్యంలో సందర్శించారు.బాలుర పాఠశాలలో అటెండర్ లేదని కంప్యూటర్ టీచింగ్ , నాన్ టీచింగ్ స్టాఫ్ లేరని, టౌన్ బాలుర పాఠశాల పాత గదుల స్థానంలో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు బిల్డింగ్ హాస్టల్‌ని మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, గడ్డం శోభన్, సిపిఎం నాయకులు తాటికంటి రంజిత్ కుమార్, తుర్పాటి నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సమగ్ర వ్యాధి నివారణ పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కరీంనగర్ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధా రాజేంద్ర ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం తనుగుల గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమళ కాలనీవాసులకు సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ క్యాంపులో లెప్రసీ విభాగం ఐసిటిసి విభాగం, ఎన్‌టిఈపి విభాగం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని హెచ్ఐవి, హెపటైటిస్ బి, సిఫిలిస్, టీబి, బిపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. లెప్రసీతో బాధపడుతున్న వ్యక్తులకు పాదరక్షలు పంపిణీ చేశారు. బీపి, షుగర్ మందులు ప్రైవేట్ మందులు వాడేవారు ప్రభుత్వ మందులనే వాడాలని తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వ మందులు సమర్థవంతంగా పని చేస్తాయని వారికి వివరించారు.ఎంఎల్‌హెచ్‌పి డా.కార్తిక్, డిపిఎంఓస్ కృపలాదేవి ప్రకాశ్ రావు, సిహెచ్ఓ సదానందం, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, ఏఎన్ఎంలు మనీ, రజిత, ఐసిటిసి కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇబ్రహీం, టీబీ స్క్రీనింగ్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తిని చాటిన పారమిత విద్యార్థులు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** పారమిత విద్యా సంస్థల అధినేత డా.ఇ.ప్రసాదరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు సేవా స్ఫూర్తిని చాటారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పారమిత ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు, నగదు సహాయాన్ని అందజేశారు. ఇందులో 8 క్వింటాళ్ల బియ్యం, 17 కిలోల చింతపండు, 60 కిలోల పప్పు ధాన్యాలు, 35 లీటర్ల నూనె ఉన్నాయి. పాఠశాల యాజమాన్యం తరపున రూ.50 వేల నగదు సహాయాన్ని అందించారు. పారమిత విద్యా సంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, అనుకర్ రావు, వినోద్ రావు, వియుఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, గోపీకృష్ణ, శ్రీకర్, శర్మిష్ఠ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన మహిళను గుర్తించిన పోలీసులు



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న వంతెన సమీపంలో గుర్తు తెలియని మహిళ ఒంటరిగా నిలబడి ఉన్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫోన్ ద్వారా స్థానికులు సమాచారం అందించారు. సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మహిళను భద్రంగా తమ ఆధీనంలోకి తీసుకొని విచారించారు. విచారణలో ఆమె తన పేరు రాపు రాథోర్, వయసు 35 సంవత్సరాలు, తండ్రి పేరు రామ్ గోపాల్ రాథోర్, స్వగ్రామం ఖాటిమా, ఉదమ్ సింగ్ జిల్లా, ఉత్తరాఖండ్ రాష్ట్రం అని తెలిపింది. విచారణలో కుటుంబ కలహాల కారణంగా భర్తతో గొడవపడి సుమారు వారం రోజుల క్రితం ఉత్తరాఖండ్ రాష్ట్రం నుంచి వివిధ వాహనాల్లో ప్రయాణిస్తూ కరీంనగర్ కు చేరుకున్నట్లు సమాచారం. అనంతరం కరీంనగర్ బస్టాండ్‌లో ఓ బస్సు ఎక్కగా టికెట్టు డబ్బులు లేకపోవడంతో బస్సు సిబ్బంది ఇరుకుల్ల గ్రామ సమీపంలో దింపేసినట్లు వివరించింది. మహిళ తెలిపిన వివరాల ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు ఫోన్ ద్వారా సంప్రదించగా గత వారం రోజులుగా ఆమె కనిపించకపోవడంతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. తాము కరీంనగర్ కు వచ్చి ఆమెను తీసుకెళ్తామని పోలీసులకు తెలిపారు.

## నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ సంగెం శ్రీరాంపూర్ గ్రామాల మధ్య ఉన్న దారి వరదల ప్రభావంతో కొట్టుకుపోగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా నిధుల మంజూరు కి కృషి చేశారని గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి తెలిపారు.కాగా మంగళవారం పంచాయతీరాజ్ ఈఈ లక్ష్మ ణ్ రావు,డి ఈ అన్వర్,ఏఈ రాగసుధ కొట్టుకుపోయిన దారి పరిశీలించి సూచనలు అందించారు.నిధుల మంజూరికి కృషి చేసిన ఎమ్మెల్యే సంజయ్ కి గ్రామస్తుల తరఫున సర్పంచ్ తోట మాదిరి రాజారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయ వివక్ష చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన అధికారిక సమావేశానికి కేవలం అధికార పార్టీకి చెందిన నాయకులకు మాత్రమే ఆహ్వానం అందించి, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను విస్మరించడంపై జగిత్యాల రూరల్ మండలంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.జగిత్యాల సహకార సంఘం చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, కల్లెడ సహకార సంఘం చైర్మన్ సందీప్ రావులకు మండల స్థాయి అధికారిక సమావేశం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విచారకరమని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను సమానంగా గౌరవించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ విషయంపై జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా మెమోరాండం సమర్పించి,తగిన చర్యలు తీసుకోవాలని కోరుతామని ప్రతిపక్ష నాయకులు హెచ్చరించారు.

## బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**ప్రజాపక్షం/కోరుట్ల :** బీసీ వర్గాలకు '50 శాతం రిజర్వేషన్లు' కల్పించడమే లక్ష్యంగా పోరాడాల్సి అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ రఘు పిలుపునిచ్చారు.ఆగస్టు 6న హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' పోస్టర్లను కోరుట్ల నియోజకవర్గంలో పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. సభను విజయవంతం చేయాలని కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు, బీసీ సంఘాల నాయకులకు,యువతకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన మార్గంలో సామాజిక న్యాయం కోసం ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, సమాజంలో సమాన అవకాశాలు కల్పించే చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు అజార్, సుఖేంధర్ గౌడ్, ప్రశాంత్,ముఖిమ్,ప్రణీత్, సుద్దాల నాగరాజు, సంతోష్,నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులవి అవగాహన లేని మాటలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం అయిన ప్యాకేజీ6 నందిమేడారం పంపు హౌస్ సందర్శనకు వెళ్లిన ధర్మపురి కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడారని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్, ఏఎంసి మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్ ధ్వజమెత్తారు.ధర్మపురి పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టును 2004లో బీఆర్ఎస్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేస్తే 2016లో బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిచేసారని రాజేష్ గుర్తుచేశారు.ఇక నందిపంపుహౌస్ వద్ద బాహుబలి మోటర్ల ద్వారా మిడ్ మానేరు కు నీళ్లు తరలించేది వాస్తవం అయితే దాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రావిటీ ద్వారా నీళ్లు వెళ్తోందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. అక్కడి టన్నెల్స్,పంపుహౌసులు,కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన విషయం ప్రతీ ఒక్కరికీ తెల్సిందేనన్నారు.మేడారం పంపుహౌస్ సందర్శనకు వెళ్లిన కాంగ్రెస్ నేతలకు ఏం మాట్లాడాలో అర్థంకాక ధర్మపురి కూరగాయల మార్కెట్,చింతామణి చెరువు,ధర్మపురి గోదావరి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు.రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దనే ఆలోచనతో మాజీమంత్రి ఈశ్వర్ కోట్లాది రూపాయలతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేస్తే గద్దెలు పెద్దగా వున్నాయని విక్రయదారులను రెచ్చగొట్టింది మీరుకాదా అని రాజేష్ ప్రశ్నించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో ధర్మపురిలో నిర్మించిన 50 పడకల మతాశిశు ఆసుపత్రిని, స్మశానవాటికను వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు పేరు రావొద్దనే కారణంతో వాటిని వినియోగంలోకి తేవడం లేదన్నారు. ధర్మపురి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే తాము సహకరిస్తామని అంతేగాని అధికారం ఉంది కదాని ఇస్తానురీతిన వ్యవహరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని రాజేష్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ బండారి రంజిత్,సంగి శేఖర్,మల్లేశం,శ్యామ్,ఎల్లాగౌడ్, అశోక్,రాజన్న,విజయ్,బద్రి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే రైతు సాధికారత :రిటైర్డ్ జెసి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంతో పాటు రైతు సాధికారతే లక్ష్యంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని భీమ్ రాజ్ పల్లి గ్రామంలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ (జేసీ) కందుకూరి కృష్ణారెడ్డి సహకారంతో మంగళవారం స్థానిక రైతులకు నాణ్యమైన మామిడి మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రిటైర్డ్ జేసీ కందుకూరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే వృక్షాల పెంపకం నేటి సమాజానికి ఎంతో అవసరం. నా పుట్టిన నేలకు గ్రామ రైతులకు నావంతు సామాజిక బాధ్యతగా ఈ మామిడి మొక్కలను అందించడం చాలా సంతోషంగా ఉంది.రైతులందరూ ఈ మొక్కలను నాటి తగిన జాగ్రత్తలతో పెంచి ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు.అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొమ్మన కుమార్ మాట్లాడుతూ సమాజ సేవలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఉద్ఘాటించారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు మద్దతుగా నిలిచి మొక్కలు అందించిన రిటైర్డ్ జేసీ కృష్ణారెడ్డికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి,ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ,వార్డు సభ్యులు సాగర్, గంగవ్వ, లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్,కోశాధికారి సురేష్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు స్థానిక రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పెద్ద చెరువును కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఇటీవల దెబ్బతిన్న చెరువు బండ్‌తో పాటు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెట్‌పల్లి పెద్ద చెరువు ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకారులకు జీవనాధారమని అన్నారు.అధికారుల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో చేపట్టిన పనుల కారణంగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.దెబ్బతిన్న చెరువు బండ్‌ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. చెరువును యథావిధిగా పునరుద్ధరించి,గతంలాగే నీటిని నిల్వ చేసేలా



చర్యలు తీసుకోవాలని సూచించారు.మెట్‌పల్లి పట్టణ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, చెరువు సమస్య వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి పెద్ద చెరువు బండ్‌ను వెంటనే పునరుద్ధరించాలి : నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలి.చెరువును యథావిధిగా నీటితో నింపాలి.. మెట్‌పల్లి ప్రజల భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి వెంటనే చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ డిమాండ్ చేశారు.

## చేవెళ్లలో దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద డిహెచ్పిఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం అసైన్మెంట్ భూములకు హక్కులు కల్పించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ అసైన్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలని దళితులపై ఇప్పటికీ గ్రామాల్లో పట్టణ కేంద్రాల్లో కుల వివక్షత అంటరానితనం ఉందని దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెడుతున్నాయని వారు అన్నారు.పట్టణ కేంద్రంలో నివసిస్తున్న నిరుపేదలకు అర్హులైనటువంటి నిరుపేద లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇల్లు ,కానీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించకుండా దళిత కుటుంబాలకు విద్యా ఉపాధి ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు పెట్టాలని ప్రభుత్వాన్ని ఇరుగురాల భూమేశ్వర్ డిమాండ్ చేశారు.

## 10 ఏళ్లలో లేని అభివృద్ధిని మూడేళ్ళలో చేసి చూపించాం

**ప్రజాపక్షం/ధర్మపురి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల్లోనే 10 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ పాలనలో జరగని అభివృద్ధి పనులు ధర్మపురి పట్టణంలో జరిగాయని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు మీ పాలనకు విసుగుచెంది 15 వార్డులకు 15 వార్డులు లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అధికారం కోల్పోయామని మతిభ్రమించి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ నిర్మాణం వ్యతిరేకించింది మేమేనని ప్రజలకు ఉపయోగపడే విధంగా సిద్దిపేట్, గజ్వేల్ సిరిసిల్లలో లో ఉన్న విధంగా మార్కెట్ కమిటీ నిర్మాణం చేయాలని అనేకసార్లు సూచనలు చేసిన పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు.

## కష్టపడ్డ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది

**ప్రజాపక్షం /రాయికల్ :** కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ అన్నారు.మంగళవారం రాయికల్ పట్టణంలో పట్టణ,మండల యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువతకి అవకాశాలు కల్పిస్తుందని కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రానున్న ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికల్లో యువత చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ బలుస సాయి,అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ కర్నె భూమా రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొద్దుల శివ,రాయికల్ పట్టణ యూత్ నాయకులు అల్లె పురుషోత్తం,అనుమల్ల చింటూ,కాశిరెడ్డి సంజీవ్,మోర చైతన్య,గుండేటి రూపేష్,నరంశెట్టి మనోజ్,గట్టు బంటు,సింగని వరుణ్,శ్రీరాముల సాయి,పడిగెల నరసింహ,కొత్తపెల్లి అరవింద్, శివ,శ్రీకాంత్, సాయి,హరీష్,జలపతి,మధు,యూత్ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లు మ్యాకల కాంతారావు,మ్యాకల రమేష్ ల సోదరుడు మ్యాకల గంగాధర్ మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వీరి వెంట సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు,పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్, సర్పంచ్ బెజ్జంకి మోహన్,నాయకులు గంద్ర అచ్యుతరావు,గన్నే రాజారెడ్డి,సుదవేణి మురళి,సింగని రమేష్,మహేందర్ బాబు,తంగేళ్ల రమేష్,మొఖిద్,తిరుపతి గౌడ్,నిమ్మల శేఖర్,విజయ్, తదితరులు ఉన్నారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ

**ప్రజాపక్షం /రాయికల్ :** ధావన్ పెల్లి గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ మాలవత్ ప్రసాద్ ఆధ్వర్యంలోమంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు. గ్రామంలో చేపట్టాల్సిన సిసి రోడ్ల నిర్మాణం,మురికి కాలువల పూడికతీత, తాగునీటి,గృహజ్యోతి, సరఫరా మరియు వీధి దీపాల నిర్వహణ వంటి పలు అంశాలపై గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాలవత్ ప్రసాద్ మాట్లాడుతూ వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ గ్రామసభలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి రాజి రెడ్డి మరియు స్థానిక ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రాలు కుటుంబ వాతావరణాన్ని కల్పించాలి

### అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** బాలల సంరక్షణ కేంద్రాలు కుటుంబ వాతావరణము కల్పించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ అన్నారు.మంగళవారం మహిళా–శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం శివారులోని మిచ్చమ్మ ఆశ్రమంలోని బాలల సంరక్షణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.పిల్లలకు అందుతున్న విద్య, ఆరోగ్య సేవలు, పోషకాహారం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ రికార్డులను పరిశీలించి పిల్లలతో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ ఆత్మీయంగా మాట్లాడారు. సంరక్షణ కేంద్రాల అధికారి కరుణశ్రీ, శిశు వైద్య నిపుణులు డా. కోటగిరి భీమేష్, సంరక్షణ కేంద్ర నిర్వాహకులు జంగిలి సునీత వెంకట్,తదితరులు పాల్గొన్నారు.

## రైతులు డ్రోన్ స్ప్రేయర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో డ్రోన్స్ స్ప్రేయర్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు వేంపేట నర్సారెడ్డి అన్నారు.ఈ మేరకు మంగళవారం నూతన డ్రోన్ స్ప్రేయర్ సర్వీసును పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పాదం భూమేష్, డైరెక్టర్లు లక్ష్మి రెడ్డి నారాయణ,కొండయ్య ,రైతులు ,సిబ్బంది పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



ప్రజాపక్షం / మందమర్రి : ప్రమాదవశాత్తు కుమారుడిని కోల్పోయిన నిరుపేద కుటుంబానికి మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మందమర్రి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన సుర శారద ప్రథమ కుమారుడు సుర వంశీ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ నిరుపేద కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు, వారికి కొండంత అండగా ఉంటామని భరోసానిస్తూ నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వడ్లూరి సునీల్, సోషల్ మీడియా ఇన్చార్జ్ మూడారపు శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఎండి. జావీద్ ఖాన్, ప్రదీప్, రిత్విక్, పచ్చిక మహేందర్, సతీష్, రహీం, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఇంచార్జ్ రేంజ్ ఆఫీసర్ సస్పెన్షన్




ప్రజాపక్షం / జన్నారం : కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ ఇంధన్‌పల్లి ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ కాలేశ్వరం జోన్ సిసిఎఫ్ ప్రభాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఇంధన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి చెందిన ఆరుగురు ఆదివాసీ యువకులపై దా డి జరిగిన ఘటనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాఖాపరమైన చర్యగా ఆయనను స స్పెండ్ చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ ఉన్నతాధికారులు విచారణ కొనసాగిస్తున్నారని, పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## వీధి దీపాల పనుల పరిశీలన

ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొమిన్‌పురా కాలనీలో చేపట్టిన వీధి దీపాల ఏర్పాటు పనులను సర్పంచ్ కొడప ప్రకాష్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. ప్రజలకు రాత్రి వేళల్లో మెరుగైన వెలుతురు అందించి, భద్రతను పెంపొందించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తయ్యేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించబోమని, ప్రతి కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల సిఎంపిఎఫ్ వివరాలు ఆన్‌లైన్ చేయాలి

### ఐఎఫ్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ డివిజన్ సివిల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సిఎంపిఎఫ్ వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలోని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్ సివిల్ విభాగంలో పనిచేస్తున్న సుమారు నాలుగు వందల మంది కాంట్రాక్టు కార్మికులకు గత నాలుగు సంవత్సరాలుగా వారి పేర్లపై జమవుతున్న సిఎంపిఎఫ్ నిధుల వివరాలను చూపించడం లేదని ఆరోపించారు. గత ఏడాది ఏప్రిల్‌లో సిఎంపిఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన సమయంలో, మూడు నెలల్లో సిఎంపిఎఫ్ ఖాతాల వివరాలను లెక్కలతో సహా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెస్తామని అప్పటి రీజినల్ కమిషనర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ డివిజన్‌కు చెందిన సివిక్, సివిల్ కాంట్రాక్టు కార్మికుల సిఎంపిఎఫ్ వివరాలు ఆన్‌లైన్ చేయకపోవడంతో పాటు కనీసం సిఎంపిఎఫ్ చిట్టీలు కూడా అందించలేదని విమర్శించారు. దీంతో తమ నిధులు ఎక్కడ జమ అవుతున్నాయో తెలియక కార్మికులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే ఖాతా వివరాలను ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు శ్రీరాంపూర్ డివిజన్ నాయకులు మాడుగుల శంకర్, సునర్‌కార్ శేఖర్, గద్దల శంకర్, బాపు, దుగ్యాల సంతోష్, రమేష్, పైడిరాజ్, రమ పాల్గొన్నారు.

## కమిషనర్ మురళీకృష్ణను వెంటనే బదిలీ చేయాలి

### బిఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ప్రజాప్రతినిధులను, ప్రజలను, అధికారులను గౌరవించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయనను వెంటనే బదిలీ చేయాలని బిఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. గతంలో బదిలీ అయిన కమిషనర్‌ను మళ్లీ క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎందుకు తీసుకువచ్చారో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు అన్ని ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూమయ్య గౌడ్, శ్రీను, స్వర్ణలత, నాయకులు కుమార్, సతీష్, రాజు, రామిడి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి గ్రామసభ కీలకం

### సర్పంచ్ మొహర్లే బాపూజీ



ప్రజాపక్షం / వాంకిడి : గ్రామం సమగ్ర అభివృద్ధి చెందడానికి గ్రామసభ ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ మొహర్లే బాపూజీ అన్నారు. వాంకిడి మండలంలోని సారాండి గ్రామపంచాయతీలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు, పాలకవర్గం సమిష్టిగా కృషి చేస్తేనే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దగలమన్నారు. అంటువ్యాధుల నివారణ, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లు, మురికి కాలువల నిర్వహణపై గ్రామస్థులతో చర్చించి సూచనలు స్వీకరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ, మహిళల సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని పంచాయతీ కార్యదర్శి జాడీ సోనం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్నులే దొడ్డజి, వార్డు సభ్యులు దుర్గం కమలాకర్, జాడి రమాదేవి, మహేశ్వరి, అంగన్వాడీ టీచర్, గ్రామ పెద్దలు యశ్వంత్ రావు, సంజీవ్, మారోతి, మెంగాజీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

### జడ్‌పి సిఇఒ లక్ష్మీనారాయణ



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జడ్‌పి సిఇఒ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మొదటి ఆసిఫాబాద్ మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పి సిఇఒ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, వంతెన నిర్మాణాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రస్తావించగా.. వివిధ శాఖల అధికారులు పురోగతి నివేదికలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, తహసిల్దార్ రియాజ్ అలీ, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా సయ్యద్ రిజ్వాన్



ప్రజాపక్షం / కెరమెరి : ఉప సర్పంచుల ఫోరం కెరమెరి మండల అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పతంగే లింబదాస్, ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశీ పరమేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మొహార్లే మోహన్, కోశాధికారిగా వాగ్మరే శ్రీకాంత్, సభ్యులుగా మడవి తుకారాం, బాంనే సాగర్, జాదవ్ దిలీప్, ఆత్రం బారికరావు, మొహార్లే రాందాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్ మాట్లాడుతూ మండలంలోని ఉప సర్పంచులందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ పరంగా రావలసిన గుర్తింపు, అధికారాల కోసం సమిష్టిగా పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి లు అబ్దుల్ కలాం, పెందోర్ మోతిరాం, కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, ఇందాపూర్ సర్పంచ్ బుచ్చయ్య, నాయకులు ఆత్రం రాము, షైక్ మున్ను, ఆడ రాంచందర్ పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఎద్దు మృతి



ప్రజాపక్షం / రెబ్బెన : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కరెంట్ షాక్ తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన రెబ్బెన మండలంలో చోటుచేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపురం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం రైతు పల్లె రవికి చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. గ్రామంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ప్రమాదకర స్థితిలో వేలాడుతున్నాయని, ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నేడు మూగజీవం బలికాగా, రేపు మనుషుల ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు మండిపడుతున్నారు. ఎద్దు మరణంతో సదరు రైతు వ్యవసాయ పనులు పూర్తిగా స్తంభించిపోయాయని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రమాదకర విద్యుత్ లైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : తవక్కల్ స్కూల్ వ్యవస్థాపకులు దివంగత అబ్దుల్ మజీద్ 63వ జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు మంగళవారం కాంగ్రెస్ మైనార్టీ టౌన్ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ లాడెన్ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ అఫ్జల్ లాడెన్ మాట్లాడుతూ దివంగత అబ్దుల్ మజీద్ విద్యా సేవలు మరవలేనివని, తవక్కల్ స్కూల్‌ను స్థాపించి ఎందరో పేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు విద్యాబుద్ధులు నేర్పించారని, సమాజ సేవే లక్ష్యంగా నిరుపేదలకు అండగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంధ్యారాణి, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామానికి చేసిన సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్‌: ఉపాధ్యాయులుగా విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేసిన సేవలు మరువలేనివని పిప్పలధరి మండల సాధన కమిటీ అధ్యక్షుడు తెలంగ్ బాపురావు కొనియాడారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం దహిగూడ గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆత్రం ఇస్తారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో కార్యదీక్షత, విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేసి విద్యాబుద్ధులు నేర్పించారన్నారు. పేద, ధనిక తేడా లేకుండా విద్యార్థులందరికీ అండగా నిలిచారని తెలిపారు. గ్రామంలో విద్యార్థులకు, ప్రజలకు ఎంతోసేవ చేసిన ఉపాధ్యాయుడి వీడ్కోలు పట్ల గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమర లక్ష్మీ బాయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సుంకిడిలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాపక్షం/తలమడుగు: తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో అంగన్‌వాడీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పీడీ మిల్కా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. గర్భిణులు, బాలింత లు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభు త్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ, ఉప సర్పంచ్ అజయ్, సీడీపీఓ సురేఖ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థుల నమోదు, హాజరు 100 శాతం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బడికి గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ లోగా రెండు జతల ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేవల్లో వేగం పెంచాలి

డిప్యూటీ కలెక్టర్ (శిక్షణ) మహమ్మద్ విలాయత్ అలీ



ప్రజాపక్షం / మందమర్రి : ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా మున్సిపల్ పరిధిలోని అన్ని కార్యక్రమాలను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ (శిక్షణ) మహమ్మద్ విలాయత్ అలీ అధికారులను ఆదేశించారు. మందమర్రి మున్సిపాలిటీలో చేయూత పింఛన్ల పంపిణీ, లైవ్ ఆథెంటికేషన్, మరణాల నమోదు, కొత్త పింఛన్ల అర్హత నిర్ధారణ ఫీల్డ్ వెరిఫికేషన్ పనులను మంగళవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా హరితహారం, వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, ఫాగింగ్ కార్యక్రమాలు తదితర మున్సిపల్ సేవల అమలుపై సమగ్రంగా పర్యవేక్షించి పురోగతిని సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజలింగు, డిఆర్‌డిఎ డిపిఎం అన్నాజీ, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బొల్లు శ్యాంబాబు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాట ఫలితమే మణుగూరు ఓసిపి కేటాయింపు

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ



ప్రజాపక్షం / మందమర్రి : మణుగూరు డిప్ సైడ్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును సింగరేణి కంపెనీకి కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులకు ఉచిత అల్పాహారం, తేనీటి విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, నాయకులు భీమనాధుని, కంది శ్రీనివాస్ మాట్లాడుతూ మణుగూరు డిప్ సైడ్ ఓసిపి సింగరేణికి దక్కడం ఎఐటియుసి చేపట్టిన నిరాహార దీక్షలు, ధర్నాలు, సమ్మె నోటీసులు తదితర నిరంతర ఉద్యమాల ఫలితమేనని పేర్కొన్నారు. కార్మికుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిల చెల్లింపునకు కృషి చేయాలని ఇతర సంఘాల నాయకులకు సూచించారు. ఎర్రజెండా కార్మిక సంఘమైన ఎఐటియుసి భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు సంపత్, కుమారస్వామి, సిహెచ్ శర్మ, సృజన గీతిక, ఏరియా నాయకులు రాజేశం, ఎగ్గేటి రాజేశ్వరరావు, సి.వి. రమణ, గోపతి సత్యనారాయణ, బానయ్య, హేమచందు పాల్గొన్నారు.

## ఆర్‌కె -7 గనికి బహుమతులు రావడం గర్వకారణం

జిఎం మునిగంటి శ్రీనివాస్



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : సింగరేణి 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాల్లో ఆర్‌కే7 భూగర్భ గని రెండు ప్రతిష్ఠాత్మక బహుమతులు సాధించడం గర్వకారణమని రాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. భద్రతా పక్షోత్సవాల్లో విజయం సాధించిన సందర్భంగా మంగళవారం ఆర్‌కే 7 గని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా జిఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రూప్1 విభాగంలో ఓవరాల్ రెండో బహుమతి, సాండ్ స్టోవింగ్ విభాగంలో తొలి బహుమతి సాధించడం ఏరియాలో భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. అందరి సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని, ఈసారి ఫైవ్ స్టార్ రేటింగ్‌తో పాటు భద్రతా పక్షోత్సవాల్లో మొదటి స్థానం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొట్టె కిషన్‌రావు, భద్రతాధికారి సంతోష్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ కార్యదర్శి సారయ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యకే ప్రాధాన్యం

అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

ప్రజాపక్షం / లక్సెట్టిపేట : ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. లక్సెట్టిపేట మండలంలో వర్షాలకు నీట మునిగిన ముల్కలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులను తాత్కాలికంగా సమీప పాఠశాలకు తరలించిన చర్యలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తూ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పల్లె దవాఖానాలో వైద్య సేవలు, మోడల్ స్కూల్ మౌలిక వసతులు మరియు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామసభకు అధికారుల డుమ్మా

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి కలాన్ గ్రామపంచాయతీలో సర్పంచ్ సతీష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గ్రామసభకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్ అధికారి కోసయ్య, అంగన్వాడీ టీచర్లు తప్ప ఇతర శాఖల అధికారులు ఎవరూ హాజరు కాకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ముందుగానే సమాచారం అందించినా అధికారులు రాకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ విషయాన్ని జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండల కేంద్రంలోని 10 అంగన్వాడీ కేంద్రాల్లో కేవలం నాలుగింటికే భవనాలు ఉన్నాయని, అవి కూడా శిథిలావస్థలో ఉన్నాయని టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలో వీధి దీపాలు, తాగునీరు, వి ద్యుత్ స్తంభాల మార్పు, మురుగునీటి కాల్వల సమస్యలను లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, గ్రా మ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గౌడన్న చైతన్య బస్సు యాత్ర

ప్రజాపక్షం / జన్నారం : గీత కార్మికుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల అమలు కోసం చేపట్టిన గౌడన్న చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా కన్వీనర్ లచ్చ గౌడ్ పిలుపునిచ్చారు. జన్నారం మండల కేంద్రంలో సోమవారం ఈ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లచ్చ గౌడ్ మాట్లాడుతూ సాంప్రదాయ వృత్తులు సంక్షోభంలో పడటంతో గౌడ వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి సిద్ధంగా ఉన్న కోటి తాటి, ఈత చెట్లు పర్యావరణ పరిరక్షణతో పాటు లక్షలాది మందికి జీవనోపాధిని ఇస్తున్నాయని, అయితే ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. 2న ప్రారంభమైన ఈ యాత్ర 14న జన్నారం మండలానికి చేరుకుంటుందని, గౌడన్నలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ గౌడ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, సంటి గౌడ్, నర్స గౌడ్, సతీష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## దళిత మహిళా సర్పంచ్‌ను అవమానించడం సరికాదు

తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాపక్షం / నెన్నెల/ బెల్లంపల్లి : నెన్నెల మండలం గొల్లపల్లి దళిత మహిళా సర్పంచ్ జాడి లక్ష్మి పట్ల ప్రోటోకాల్ పాటించకుండా అవమానపరచడం సరికాదని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. శనివారం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవ పనుల్లో భాగంగా హాజరైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ నాయకుడు హరీష్ గౌడ్‌లు దళిత మహిళా సర్పంచ్‌ను పక్కనబెట్టి ఓ మాజీ సర్పంచ్‌తో కొబ్బరికాయ కొట్టించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ దళిత మహిళా సర్పంచ్ పట్ల వివక్ష చూపుతూ నిరంకుశంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు.మరోసారి ఇలాంటి అవమానాలకు పాల్పడితే సహించేది లేదని, ఎమ్మెల్యే, నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలాలి నర్సయ్య, జాడి రామచందర్, రాష్ట్ర కార్యదర్శి గోమాస రాజం, మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్, నాయకులు చదువుల వెంకటరమణ, జాడి నారాయణ, బెడ్డల మహేందర్, సర్పంచ్ జాడి లక్ష్మి పాల్గొన్నారు.

## అధికారులపై దాడి కేసులో దంపతుల బైండోవర్



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : సివిల్ సప్లైస్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో సిర్పూర్ (టి) మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన ఉరాడే దేవాజీ, ఆయన భార్య ఉరాడే మంగలాబాయిని మంగళవారం తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ 129(ఇ) ప్రకారం ఆరు నెలల పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని ఇద్దరి నుంచి రూ.1 లక్ష చొప్పున బాండ్ తీసుకున్నారు. జూలై 26న సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్‌లో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను తనిఖీ చేస్తున్న అధికారులపై దాడి చేసి విధులకు భంగం కలిగించిన దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ హెచ్చరించారు.

## వాగు దాటి వైద్యం

ప్రజాపక్షం/తలమడుగు: తలమడుగు మండలం బరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రేకులగూడ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్య సిబ్బంది వాగును కాలినడకన దాటి వెళ్లి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రజలతో పాటు అత్యవసర సేవలందిస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రేకులగూడ గ్రామానికి పక్కా రహదారి నిర్మించి తమ రవాణా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏకపక్ష జిల్లా కమిటీలను రద్దు చేయాలి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీలను తక్షణమే రద్దు చేయాలని నిర్మల్ జిల్లా టి.సి.ఏ కోచ్ రామరాజు మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. హైకోర్టు, బీసీసీఐ ఆదేశాలను ధిక్కరిస్తూ, హెచ్ సి ఏ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు.న్యాయపరమైన అంశాలు తేలే వరకు కొత్త కమిటీల ఏర్పాటు నిలిపివేయాలన్నారు. గ్రామీణ క్రికెట్‌ను వాణిజ్యపరం చేస్తూ..,ప్రతిభకు బదులు డబ్బుకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. టీజీ20 లీగ్‌లో 60 శాతం మంది ఇతర రాష్ట్రాల ఆటగాళ్లే ఉన్నారని ఆరోపించారు.పారదర్శకమైన క్రికెట్ పరిపాలనతో తెలంగాణ క్రీడాకారులకు ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పించాలని కోరారు.

## ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ

ప్రజాపక్షం/దిలావర్ పూర్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఉచితంగా కూరగాయలకు సంబంధించిన విత్తనాలను ఉద్యవన శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ అక్షరా అనిల్ మరియు ఉప సర్పంచ్ సుఖేష్ మీదుగా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. రైతులు వరి మరియు ఇతర పంటలు కాకుండా కూరగాయలు, ఆయిల్ ఫామ్ వంటి వాటిని సాగు చేయాలని ఉద్యవన శాఖ ద్వారా సబ్సిడీలో అందించడం జరుగుతుందని రైతులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ గోవర్ధన్. హార్టికల్చర్ విస్తరణ అధికారి సౌమ్య,గ్రామపంచాయతీ ఈవో మహేందర్,వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు



ప్రజా పక్షం/పెంబి : పెంబి మండలం చాకిరేవ్ గ్రామంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు.జిల్లా కమిటీ పిలుపు మేరకు గ్రామంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొడసం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు ప్రతి ఆదివాసీ గ్రామంలో జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శంభు,గ్రామ పటేల్ లింబారావ్,ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ఉద్యోగం సాధించిన వాడీ రాజేష్

ప్రజాపక్షం/నిజామాబాద్ : బంక్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్న ధర్పల్లి మండలం వాడీ గ్రామానికి చెందిన మల్లం రాజేష్ ఆర్టీసీలో ఉద్యోగం సాధించడం గొప్ప విషయం. ఇటీవల విడుదల చేసిన ఆర్టీసీ డీజిల్ మెకానిక్‌లో రాజేష్ ఉద్యోగం సాధించారు. ఉద్యోగం వచ్చే వరకు హొన్నాజీపేట్ పెట్రోల్ బంక్‌లో పని చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్నేహితులు భాస్కర్, రమేష్, మోహన్‌రెడ్డి, నరేష్, రాంచందర్, సాయి, నర్సయ్య, బాల్‌రాజ్, మోహన్, సాగర్, శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు.

## పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

### విద్యారంగ సమస్యలపై సబ్ కలెక్టర్ కు వినతి




ప్రజాపక్షం/భైంసా: పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యారంగంలోని వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ, తహసీల్దార్ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ..ఏళ్లు గడుస్తున్న ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లు, విద్యారంగంలోని సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని,ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థులకు గత 23 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. అద్దె భవనాల్లో నడుస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వ సొంత భవనాలు వెంటనే నిర్మించాలిశిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాల భవనాలను కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలి.40 సంవత్సరాలు దాటిన సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు మంజూరు చేయాలి.ప్రభుత్వం వెంటనే స్పందించి పై డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఆందోళనలు చేస్తామని పిడిఎస్‌యు నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ కిరణ్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు వి.గోదావరి నాయకులు సంతోష్,సిద్ధార్థ్,విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణ ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల



ప్రజాపక్షం/సారంగాపూర్ : బిజెపిఎల్పి నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో స్వర్ణ ప్రాజెక్టు నుంచి జౌళి నాలా ద్వారా 80 క్యూసెక్కులు, లెఫ్ట్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని మొత్తంగా 100 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాల పంట పొలాలకు సాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేశారు. వ్యవసాయానికి సాగునీరు అత్యంత కీలకమైన నేపథ్యంలో, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు.ఈ నీటి విడుదలతో దిగువ ప్రాంతాల్లోని వేల ఎకరాల పంటలకు సాగునీటి అందుబాటు మెరుగుపడి,రైతులు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.అదేవిధంగా, స్వర్ణ ప్రాజెక్టు గేట్ల లీకేజీలను క్షుణ్ణంగా పరిశీలించి,అవసరమైన మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు.నీటి వృథాను నివారిస్తూ, సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రాజెక్టు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో మరియు సాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని,రైతుల అవసరాన్ని బట్టి రానున్న రోజుల్లో ఈ నీటి విడుదలను పెంచనున్నట్లు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్,జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి విలాస్, జిలా బిజెవైఎం అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, బిజెపి నాయకులు రాంశంకర్ రెడ్డి, సాహెబ్ రావు, బడి పోతన్న, వెంకటేష్, జౌళి గ్రామ సర్పంచ్ కొమ్ము సురేందర్, చెన్న రాజేశ్వర్,తిరుమల చారి,విజయ్,నారాయణ,కోరిపెల్లి రాజేశ్వర్ రెడ్డి,కార్యకర్తలు,ఇరిగేషన్ శాఖ అధికారులు అనిల్, రైతులు,పరిసర గ్రామాల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## గడ్‌చందాలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై తహసీల్దార్ విచారణ

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని గడ్ చందా గ్రామ ప్రజల నుంచి ప్రభుత్వ భూముల ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. మంగళవారం తహసీల్దార్ సూర్యారావు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పరిశీలించారు.ఈ విచారణలో గ్రామంలోని సర్వే నెంబర్ 1370/1 లో గల మొత్తం 6.00 ఎకరాల ప్రభుత్వ భూమిలో 5.00 ఎకరాలు, అలాగే సర్వే నెంబర్ 1369 లోని మొత్తం 9.14 ఎకరాల శిఖం భూమిలో 0.20 ఎకరాల భూమిని వంజారి సాగర్, చిన్నయ్య అనే వ్యక్తులు అక్రమంగా సాగు చేసుకుంటున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఆక్రమణలపై స్పందించిన తహసీల్దార్, సంబంధిత ఆక్రమణదారులకు తెలంగాణ భూ ఆక్రమణ చట్టం,1905 లోని సెక్షన్7 ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న ఆధార పత్రాలతో సహా ఆక్రమణ/సాగుపై పూర్తి వివరణ సమర్పించాలని వారికి ఆదేశాలు ఇచ్చారు.ఆక్రమణదారులు సమర్పించే వివరణలు,ఆధారాలను పరిశీలించిన అనంతరం చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సూర్యారావు స్పష్టం చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం అందించాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ : ప్రారంభదశలో వర్షాలు పడక విత్తనాలు మొలకెత్తక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నంది రామయ్య ఏఐయుకేఎస్ నాయకులతో కలిసి ఖానాపూర్ మండల తహసీల్దార్ సుజాత కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడక రైతులు నష్టపోయారని,మండలంలోని గ్రామాల్లో విత్తనాలు మొలకెత్తక నష్టపోయిన రైతుల పంటలను వెంటనే సర్వే చేయించాలన్నారు.నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు పంటల భీమాను అమలు చేయాలన్నారు.అదేవిధంగా ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూముల్లో ట్రాక్టర్లు వాడరాదని అటవీ అధికారులు నిబంధనలు పెట్టడం సరికాదని సాగుకు ట్రాక్టర్ల అనుమతి ఇవ్వాలని మెమోరాండం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ నాయకులు జక్కుల రాజన్న, శంకర్, లచ్చన్న,లింగాల శంకర్,మచ్చ మనోహర్,నర్సింగ్ రావు,తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వార్షికోత్సవాలు



ప్రజాపక్షం/బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ వినోద పాల్గొని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ అంతర్జాతీయ తల్లి వార్షికోత్సవ సందర్భంగా తల్లి వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఆరు నెలల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో రేవతి, మహేష్, శారద, రాణి, విజయ, గోదావరి, లత, స్వప్న, లక్ష్మీ , జ్యోతి పాల్గొన్నారు.

## డిగ్రీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు

ప్రజాపక్షం/భైంసా : తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం హైదరాబాద్లో ప్రశాంతంగా జరిగాయి.రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు రాజారెడ్డి పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. డా. కె. సురేందర్ రెడ్డి నాయకత్వంలోని ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మల్టీ జోన్ 1 కార్యదర్శిగా డా. య. రవి కుమార్ ఎన్నికయ్యారు. అలాగే నిర్మల్ జిల్లా అధ్యక్షులు గా డా. రఘు నాథ్, భైంసా యూనిట్ అధ్యక్షులు గా డా. ఎం.శంకర్ ఎన్నికయ్యారు.దీంతో జిల్లా అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా అధ్యాపకులు నూతనంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించి అభినందించారు.నూతన కార్యవర్గం ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,అధ్యాపకుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యాపకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు,అధ్యాపకులు,తదితరులు పాల్గొన్నారు.

## పీచరలో ఎస్‌హెచ్‌జి భవనం ప్రారంభం



ప్రజాపక్షం /లక్ష్మణచందా : లక్ష్మణచందా మండలంలోని పీచర గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాల విఒ భవనాన్ని బిజెఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, మహిళా సంఘాల బలోపేతానికి ఇటువంటి మౌలిక వసతులు ఎంతో తోడ్పడతాయని అన్నారు.మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాల బలోపేతానికి పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తిప్పని రాజేశ్వర్,మండల నాయకులు ముత్యం రెడ్డి,మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్,మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, నాయకులు ఓస రాజు,జీవన్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,మహిళా సమైక్య సంఘాల ప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## షెట్పల్లిలో రెస్క్యూ ఆపరేషన్‌పై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/పెంబి : పెంబి మండలం కడెం నది తీరంలో ఉన్న షెట్పల్లి గ్రామంలో మంగళవారం రెస్క్యూ ఆపరేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.అత్యవసర వరద పరిస్థితుల్లో ప్రాణ రక్షణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రెస్క్యూటీమ్ అధికారులు గ్రామస్తులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ధ్రువ లక్ష్మణ్, ఎంపిడిఒ రాజశేఖర్,ఎంపిఒ అనిల్ కుమార్,డిటి శంకర్, షెట్పల్లి సర్పంచ్ మధ్య వార్డ్ విఠల్,జంగుగూడ సర్పంచ్ శ్రీడం శశికళ శంకర్,సెక్రటరీ రమేష్,స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంతో పాల్గొని అధికారులు ప్రదర్శించిన రెస్క్యూ పద్ధతులను ఆసక్తిగా పరిశీలించారు.

## హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనం ప్రారంభం

ప్రజాపక్షం/నిజామాబాద్ : వినియోగదారులకు మరింత నాణ్యమైన విశ్వసనీయమైన విద్యుత్ సేవలను అందించాలనే లక్ష్యంతో టీజీ ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ ఆపరేషన్ సర్కిల్‌లో టాటా యోధా 3.0 ఎంటి హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనాన్ని సేవలోకి తీసుకవచ్చినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. ఈ వాహనంతో 33కెవి, 11 కెవి విద్యుత్ లైన్ల బ్రేక్‌డౌన్‌లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, చెట్ల కొమ్మల తొలగింపు, ఎత్తైన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పరికరాల నిర్వాహణ పనులు సురక్షితంగా, వేగంగా చేపట్టేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయాలు, సంభవించినప్పుడు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించటంతో పాటు విద్యుత్ సిబ్బంది భద్రతతో పనులు నిర్వహించేందుకు ఈ హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ వాహనం అందుబాటులోకి రావటంతో అత్యవసర నిర్వాహణ పనులు మరింత సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలందించగలమని సూపరింటెండింగ్ ఇంజనీర్ పేర్కొన్నారు.

## కంటి వైద్యశిబిరం

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 15 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. క్లబ్ జిల్లా చైర్మన్, అధ్యక్షులు యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో మొసలి ప్రత్యక్షం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో గల కొత్తకుంట లోని గడ్డపై ఉన్న మొసలి గ్రామస్తులకు కనిపించింది. వెంటనే వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు వచ్చి కుంటలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల మొసలి కనిపించకపోవడంతో వెళ్లిపోయారని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు రొక్కం మురళి తెలిపారు. గంగపుత్రులు కూడా చేపలు పట్టడానికి భయంతో వెళ్లడం లేదని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే మొసలిని పట్టుకొని తీసుకెళ్లాలని వారు కోరా రు.

## వర్షపు నీటి సంరక్షణపై చిత్రలేఖన పోటీలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వర్షపు నీటిని పొదుపు చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, చెరువుల పరిరక్షణ వంటి అంశాలపై ఆకర్షణీయమైన చిత్రాలను గీసి సృజనాత్మకతను ప్రదర్శించారు. వర్షపు నీటిని సేకరించడం, పొదుపుగా వాడుకోవడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు గంగాదేవి బోనాలు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** తెలంగాణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదీ బుధవారం నిర్వహించే గంగాదేవి బోనాల జాతరలో అధిక సంఖ్యలో గంగపుత్రులు,ప్రజలు పాల్గొనాలని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ, గంగాదేవి జాతరలో అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ గంగపుత్ర సంఘం నాయకులు రాజ్‌కుమార్, శంకర్, గుమ్ముల పోశం, ఆరెందుల రా జేశం, శాఖపూరి భీమ్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో విహాన హోటల్ ప్రారంభం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాని వంశీఇంటర్నేషనల్ స్టార్ హోటల్ ఇప్పుడు వంశీ విహాన సారథ్యంలో సరికొత్తగా రూపుదిద్దుకుంది. సోమవారం పూజా కార్యక్రమాలతో విహానహోటల్స్‌యజమానులు అభిషేక్ గౌడ్, లేఖజ్‌లు పునఃప్రారంభించినట్లు ముద్దపురంకైలాష్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం పర్యటక రంగాన్ని ప్రోత్సహిస్తూ ముందుకు వెళుతున్న తరుణంలో పర్యటకుల్ని ఆకర్షించే విధంగా హోటల్‌ని రూపుదిద్దించమన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతోకూడిన అత్యాధునిక హంగులతో, రుచికరమైన వెజ్, నాన్ వెజ్ వంటకాలతో, మధ్యతరగతిప్రజలకు అందుబాటులో ఉండే ధరలలో సేవలందిస్తున్నామన్నారు. శాఖాహార ప్రియులకు ప్రత్యేకంగా శాఖాపర విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.




నగరంలో వంశీ ఇంటర్నేషనల్ హోటల్ విహానలో తొలిసారిగా లైవ్ కిచెన్ ఏర్పాటు చేశామన్నారు.అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన హోటల్ నిర్వహణకు నిష్ణాతులైన లేఖజ్ సారథ్యంలో ఈ హోటల్‌నునిర్వహించనున్నట్లు కైలాస్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌కు ధీటుగా నిజామాబాద్‌లో హోటల్‌ను ఏర్పాటు చేశామన్నారు.

# విద్యతో వెలుగులు నింపిన నవోదయ

### జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ రూరల్ :** నవోదయ విద్యాలయాలు విద్యతో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ 39వ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ లోని డిఇఒ కార్యాలయం వద్ద నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కృష్ణతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత నివాస విద్యను అందించాలనే లక్ష్యంతో 1986లో ఈ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 5న నవోదయ విద్యాలయాల స్థాపన దినోత్సవం జరుపుకుంటారని గుర్తుచేశారు. ఈ పాఠశాలలు విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, విలువలను, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తున్నాయన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో స్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు డిఈఓను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ మెంబర్ ఉషన్న, సీనియర్ ఉపాధ్యాయుడు రామయ్య పాల్గొన్నారు.

# ప్రతీ విద్యార్థి మొక్కను నాటి సంరక్షించాలి

### ఎసిఎఫ్ ఎ. అప్పయ్య

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎసిఎఫ్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ డా. ఎ. అప్పయ్య పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్), ఈకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వనమహోత్సవం సందర్భంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ఎసిఎఫ్ అప్పయ్య మాట్లాడుతూ మొక్కల పెంపకం, అటవీ సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. వనమహోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తుడూరు దత్తాత్రేయ, ఈకో క్లబ్ కోఆర్డినేటర్ డా. దేవేందర్ రెడ్డి వీరమల్ల సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ లక్ష్మీ నారాయణ, డిఆర్ఓ డి. హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డా. డి. లక్ష్మీ నరసింహం, డా. ఈ. శారద, డి. జనార్థన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సిఆర్‌ఆర్‌టి వరం లాంటిది

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** అవయవాల పనితీరు దెబ్బతిని ఐసియులో చికిత్స పొందుతన్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రిప్లేస్ మెంట్ చికిత్స (సిఆర్‌ఆర్‌టి) అత్యాధునిక ప్రాణరక్షక చికిత్సగా నిలుస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మెడికవర్ నెఫ్రాలజిస్టు వైద్యులు రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు ఉపేందర్‌రెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు సత్యనారాయణ మాట్లాడుతూ, సిఆర్‌ఆర్‌టి యంత్రం పనితీరు, వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తీవ్ర అనారోగ్యంతో ఐసియులో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు ఒక్కసారిగా దెబ్బతినడం సాధారణమేనని అలాంటి సమయంలో సాధారణ డయాలసిస్‌ను తట్టుకునే పరిస్థితి చాలా మందికి ఉండదని అలాంటి క్లిష్టసమయంలో సిఆర్‌ఆర్‌టి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అలాగే ఈ చికిత్స వల్ల గుండె, ఊపిరితిత్తులు, కాలేయం




వంటి కీలక అవయవాలపై అదనపు భారం పడకుండా తిరిగి వాటిని సాధారణ స్థితికి చేర్చేందుకు సహకరిస్తుందన్నారు. ప్రజల్లో ఈ చికిత్స విధానంపై సరైన అవగాహన కల్పించి అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో మెడికవర్ సెంటర్ సెడ్  గుర్రం కిరణ్, కోట కర్ణాకర్, పబ్బ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు లేక పశువుల ఆసుపత్రి దయనీయం

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు నిర్వహణ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు జ్వరాలు, అంటువ్యాధులు వచ్చే సమయంలో ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆసుపత్రికి ఇన్‌చార్జి పశువైద్యుడు ఉన్నప్పటికీ ప్రతిరోజూ అందుబాటులో ఉండడం లేదని, సిబ్బంది లేక అత్యవసర చికిత్సలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, పరిశుభ్రత లోపించడంతో దోమలు, కీటకాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి పశువైద్యుడితో పాటు సిబ్బందిని నియమించి, ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రపరచాలని కోరుతున్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం




**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మండల కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి మండల ప్రాజెక్టు సీడీపీఓ జ్ఞానేశ్వరి, ఏసీడీపీఓ జ్యోతి హాజరై తల్లి పాలు అమృతంతో సమానమని, పుట్టిన గంటలోపే ఇచ్చే ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యాన్ని రోగనిరోధక శక్తిని పెంచటంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శారద, అనురాధ, సమత, ఉషారాణి, సువర్ణ, సరిత, పుష్ప, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## శిలాఫలకం వేశారు... రోడ్డును మరిచారు



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామంలో బిటి రోడ్డు వేసేందుకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి చేతుల మీదుగా రెండు ఏళ్ల క్రితం శిలాఫలకం వేశారు. దీంతో తమ గ్రామానికి రోడ్డు ఇబ్బందులు తీరుతాయని ఆ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఈ శిలాఫలకం వేసి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బీటీ రోడ్డును వేయలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో బురద, ఎం డకాలంలో దుమ్ము ధూళితో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నా రు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిటి రో డ్డు పనులు పూర్తి చేసి తమ సమస్యను పరిష్కారం చేసే దిశగా ఎ మ్మెల్యే భూపతి రెడ్డి చొరవ చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నా రు.

## పాఠశాలలో స్వాగత సంబరాలు

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నసర్పంచ్ గాండ్ల రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనలో ముందుండి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు తన వంతు కృషి ఎల్లవేళలా ఏర్పాటు చేస్తానన్నారు.అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో జరిగిన ఎన్నికలలో ఎన్నికైన హెడ్‌బాయ్, హెడ్ గర్ల్స్‌లను ప్రశంసించి సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయ బృందం అన్ని విధాలతోడ్పాటునందిస్తుందని రాబోయే రోజులు మరిన్ని కార్యక్రమాలు చేపట్టబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. తదనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలతో సందడి చేయటం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, వైస్‌ప్రిన్సిపాల్ గణేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళుతున్న రమేష్‌కు వీడ్కోలు

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా దీర్ఘకాలంగా నాలుగున్నర సంవత్సరాలు విధులు నిర్వహించిన కత్రాజి రమేష్ సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాస్ కొనియాడారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతిపై ఏర్గట్ల మండలానికి బదిలీపైవెళుతున్న కత్రాజి రమేష్‌ను మంగళవారంతహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు పదోన్నతులు సహజమని ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడి ప్రజలకు మంచి సేవలందించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వనజ, ఆర్ఐ గంగాధర్, జీపీఓలు, వీఆర్ఎలు, కార్యాలయ సిబ్బంది,పాల్గొన్నారు.